# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

December - 2000

నవంబరు 16వ తేదీ గురువారంనాడు ఖమ్మం జిల్లా మణుగూరు ప్రాంతములోయున్న గొందిగూడెంలో ఒకరోజు సువార్తకూటము జరిగెను. ఉదయం 10-30 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆ కూటము నిర్వహించబడెను. సోదరులు పి. సురేంద్రకుమార్ గారు మరియు తదితరులు వాక్యపరిచర్య చేసిరి. ఆరోజున గొందిగూడెంలో 34 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వారందరు కోయజాతికి చెందినవారు.

నవంబరు 18నుండి 22 వరకు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణలో గొప్పప్రత్యేక బైబిలు సెమినార్ నిర్వహించబడెను. ఇంచుమించు ఆరు సంవత్సరముల తరువాత సోదరులు పెర్రి బి. కోతమ్‌గారు ఈ సెమినార్‌లో ప్రసంగించుటకు అమెరికా నుండి మరలా వచ్చిరి. ఆయన 88 సంవత్సరముల వయోవృద్ధులైనను గొప్ప నేర్పుతో దేవుని సత్యవాక్యమును బోధించిరి. రోజుకు మూడు పర్యాయములు ఈ సెమినార్ జరిగెను. యిది వరలో వలెనే వందలాది ప్రజలు ఈ కూటములకు హాజరైరి. సెమినార్ జరిగిన 5 దినములలోను 117మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. దూర ప్రాంతముల నుండి వచ్చిన వారికి మంచి భోజనవసతులు కల్పించబడెను. హాజరైన వారందరికీ స్వల్ప ఖరీదుకు బైబిళ్ళు అందచేయబడెను. నవంబరు 22న మధ్యాహ్నకాలమందు సోదరులు పెర్రి కోతమ్ గారికి గొప్ప సన్మానసభ ఏర్పాటుచేయబడెను. స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ వారు, పలు సువార్తికులు కోతమ్ గారిని పూలమాలలు వేసి సత్కరించిరి. కోతమ్ గారి వయస్సును బట్టియు, ఆరోగ్యమును బట్టియు భారతదేశమునకు వచ్చుట యిదే ఆఖరిసారియని చెప్పిరి. ఆయన భారతదేశమునకు 12 మార్లు వచ్చియుండిరి. అందులో 10 సంవత్సరముల మట్టుకు కాకినాడలో గొప్ప బైబిలు సెమినార్‌లు నిర్వహించి వేలకొలది ప్రజలకు సత్యవాక్యమునుపదేశించిరి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 | డిశంబరు 2000 | సంచిక 5


# బైబిలు గ్రంథకర్త మానవుడు కాదు-1

( Man is not the author of the Bible )

మానవ లిఖిత గ్రంధములన్నిటి కంటే బైబిలు వేరైనదను మాటను ఎవరు కాదనరు. బైబిలులో మనకు కన్పడు విశిష్టతయేమంటే-దాని సంక్షేపము లేక సంగ్రహము (brevity). అది మానవుని ఆసక్తిని సంతృప్తి పరచు విధముగా వ్రాయ బడక, గొప్ప సంగతులను బహు స్వల్ప పదజాలముతో వర్ణించును. యిది మానవునికి సాధ్యము కానిపని. ఉదాహరణకు ఆదికాండము 1:1లో "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అను ఒక చిన్న వచనముతో అది దేవుని పరిచయము చేయుచున్నది. సరిగదా భూమి, ఆకాశములు ఎట్లు కల్గెనో ఆ వచనములోనే అది చెప్పుచున్నది. దేవుని గూర్చి, సృష్టిని గూర్చి మానవుడు వ్రాయవలసి వస్తే అతడు అనేక గ్రంధములను వ్రాయవలసి వచ్చును.

క్రొత్త నిబంధనలో కూడ అనేక ప్రాముఖ్య ఘట్టములు వివరించబడు చున్నప్పుడు లేఖకులు మన ప్రశ్నలన్నిటికీ జవాబియ్యకుండా సంక్షేపముగా వాటిని గూర్చి వ్రాసారు. క్రీస్తు బాప్తిస్మము పొందిన సంఘటినను ఒకసారి చూద్దాం. సాక్షాత్తు దేవుని కుమారుడే యోర్దాను నదిలో యోహాను చేత బాప్తిస్మము పొందుటకు వచ్చియున్నారు. ఈ సంఘటనను మానవులు వివరించవలసి వస్తే క్రొత్త నిబంధనలో కనీసము **20-30** పేజీల మట్టుకు వినియోగించి యుందురు.

దేవుడు **15** శతాబ్దముల తరువాత తన స్వరమును వినిపించుచు ఆయన ఏకైక కుమారుని పరిచయము చేసారు. "ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నానని" ఆయన చెప్పారు. యేసుప్రభువు బాప్తిస్మము పొందిన సందర్భమును వివరించడానికి మత్తయి కేవలము 5 వచనములనే వినియోగించాడు (మత్తయి **3:13-17**). మార్కు 3వచనములనే వినియోగించాడు (మార్కు **1:9-11**). లూకా రెండు వచనాలను వినియోగించాడు (లూకా **3:21-22**). యోహానయితే ఆ సంఘటనను గూర్చి ఒకే ఒక్క వచనములో ప్రస్తావించాడు (యోహాను **1:32**). ఏ గ్రంధకర్త అయినా ఇంత గొప్ప సంఘటనను ఇంత సంక్షేపముగా వ్రాయగలడా ? క్రొత్తనిబంధనలో ఈలాంటి అనేక సందర్భము లను మనం కొనుగొంటాము. ప్రతి సంఘటనలోను ఇంకా వివరాలుంటే బాగుండు ననుకొంటాము. దానిని మానవులే వ్రాసినట్లయితే ఆ వివరాలన్నిటినీ, ఇంకా కొన్నిటిని జోడించి వ్రాసియుందురు. అయితే బైబిలు గ్రంధమును లిఖించుటలో దేవుడు సమస్తమును పర్యవేక్షించుచు పరిశుద్ధాత్మ ప్రేరణ ద్వారా దానిని లిఖింప జేసారని విశ్వసించుటలో లోపము యేమీవుండదు. మానవుని ఆసక్తి ఆపేక్షించే వివరాలన్నిటితోను బైబిలు వ్రాయబడలేదు. దేవుని చిత్తానికి అనువైన సంగతులే అందు లిఖించబడెను.

బైబిలు గ్రంధకర్త మానవుడు కాదనడానికి ఇంకో కారణం యేమంటే- బైబిలు అయా సంఘటనలలో చెప్పకుండా విడిచిపెట్టిన సంగతులు ! మానవుని

ఆసక్తి కోరుకొనే విషయాల్లో బైబిలు మౌనియై యుండుట ఆశ్చర్యము. బైబిలును గనుక మానవులు లిఖించియున్నట్లయితే వారు మన ఆసక్తిని సంతృప్తి పరచు అనేక వివరాలు అందు వ్రాసియుందురు. ఈ అంశమును ఇప్పుడు కొంత ఆలోచిద్దాం.

## దేవుని ఆరంభము

"ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అని ఆరు మాటలతో బైబిలు ఆరంభమయ్యింది. ఆదికాండములో గాని, మరెక్కడా గాని దేవుని యొక్క ఆరంభమేమిటో, ఆయన ఎక్కడనుండి వచ్చారో మొదలగు సంగతులు చెప్పబడలేదు. ఆయన ఎల్లప్పుడు ఉండువాడు. ఎల్లప్పుడు స్వయం ఉనికి కలిగినవాడని మనకు గ్రాహ్యమైనట్లుగా బైబిలు ఉద్దేశించుచున్నది. అది ప్రాధమిక సత్యం. ఆయన నిత్య ఉనికిని గూర్చి ప్రవక్తలు చెబుతారు. యుగ యుగములకు ఆయనే దేవుడు (కీర్తన. 90:2).

దేవతార్చన చేయువారి మతములలో తమ దేవుండ్ల ఆరంభాన్ని ఆడంబరముగా చిత్రీకరిస్తారు. ఐగుప్తీయుల వేదాంతప్రకారము తమ దేవుండ్లు "ఓసిరిస్" అనువానినుండి ఉద్భవించినట్లు చెబుతారు. ఓసిరిస్ అను సూర్యుడు ఏడు వివిధ గ్రహముల దేవుండ్లకు జననమిచ్చాడు; మరియు మరి 12 చిన్న దేవుండ్లకు జననమిచ్చాడు. ఈ 12మంది జ్యోతిషాస్త్రములో 12 రాసులు! ఈ 12మంది మరి 28 చంద్రదేవుళ్ళకు, 72మంది సూర్యదేవుళ్ళకు జననమిచ్చారు! మోషే ఐగుప్తుదేశములో పెరిగినను, ఆదికాండములో ఈ హాస్యాస్పద వేదాంతమున కెక్కడా తావీయలేదు. యిది ఆశ్చర్యము! బబులోను పురాణము లయితే అప్సు, తియామత్ అను దేవుళ్ళు మిగతా దేవుండ్లకు జననమిచ్చారని చెప్పుచున్నది. భారతదేశపు పురాణములయితే సర్వమును సృజించిన బ్రహ్మ బ్రహ్మాండమైన బంగారు గుడ్డులోనుంచి ఉద్భవించాడని చెబుతారు. గ్రీకులయితే వారి దేవుళ్ళు

ఎట్లు, ఎక్కడ ఉద్భవించారో తెలియచెప్పే క్రమపట్టికలనే తయారుచేసుకొన్నారు. బైబిలు ఇట్టి అసంభవసంగతులకు దూరముగానున్నది. ఆయామతములు తమ దేవుండ్లయొక్కయు, దేవతల యొక్కయు స్వరూపాన్ని చిత్రీకరిస్తూ వాటికి పలు లక్షణాలకు ఆపాదిస్తాయి.

## దేవుని గూర్చిన వర్ణన లేదు

బైబిలు బయలుపరచు దేవునికయితే భౌతికలక్షణమేమియు వర్ణించ బడలేదు. దేవుని యొక్క లక్షణాలను మానవులు అర్ధము చేసికొనుటకు గాను, దేవునిని మానవపదజాలములతో వర్ణించినను ఆయన భౌతికకాయుడు కాదని బైబిలు చెప్పుచున్నది. "రక్షింపనేరకయుండునట్లు యెహోవా హస్తము కురుచ కాలేదు. విననేరకయుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు..... మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను" అని యెషయా చెప్పినపుడు, ఆయన హస్తము, చెవులు, ముఖము అనుమాటలను వినియోగించి... నను మనం గ్రహించుకొనునట్లు యివి అలంకారరీతిగ వాడబడినమాటలే. యిట్టి మాటలలో బైబిలు బయలుపరచు దేవుడు మనకు వర్ణించబడినను, దాని లేఖకులు ఆయన ఆత్మయనియు, భౌతికకాయుడు కాదనియు మనకు తెలియజేయు చున్నారు.

"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యము తోను ఆరాధింపవలెను" (యోహాను. 4:24). ఆయన ఆత్మగనుక ఆయన అదృశ్యుడు. "సకల యుగములలో రాజైయుండి, అక్షయుడును, అదృశ్యుడనగు అద్వితీయదేవునికి ఘనతయు మహిమయు యుగయుగములు కలుగునుగాక. ఆమేన్" (1తిమోతి 1:17). "సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడైయున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, ఎవడును చూడనేరడు. ఆయనకు ఘనతయు, శాశ్వతమైన

ప్రభావమును కలిగియుండునుగాక. ఆమేన్" అని బైబిలు చెప్పుచున్నది (1తిమోతి 6:16). బైబిలు గనుక మానవకల్పిత గ్రంథమైతే, దేవునియొక్క వర్ణన అందులో ఎందుకులేదు?

## క్రీస్తును గూర్చిన వర్ణన లేదు

అంతేకాదు, యేసుక్రీస్తును గూర్చిన భౌతికవర్ణన కూడ బైబిలులో లేదు. మానవులు ఆయా నాయకులను గూర్చి, గొప్పఖ్యాతి గడించినవారిని గూర్చి ఏమైనా గ్రంథాలువ్రాస్తే వారెవరిని గూర్చి వ్రాయుచున్నారో వారి పుట్టుపూర్వోత్తరాలు, భౌతికలక్షణాలు, అందచందాలు వగయిరా అన్నీ వివరిస్తారు. దీన్ని అట్లుంచి బైబిలును చూచినట్లయితే యేసుక్రీస్తు బైబిలుయొక్క ప్రధమవ్యక్తి. బైబిలుకు కేంద్రం ఆయనే. బైబిలులోని 66 పుస్తకములలోను ఆయనను గూర్చి ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని వ్రాయబడింది. అయినను ఆయన భౌతిక ఆకృతిని వర్ణించే ఒక్క పంక్తికూడా బైబిలులో లేదు. సరిగదా ఆయన భౌతిక ఆకృతిని గూర్చి చెప్పబడిన మాట ఏమైనాయుంటే అది యెషయా గ్రంధములోయున్నది. యెషయా యిట్లు చెప్పాడు :

"మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను? యెహోవా బాహువు ఎవనికి బయలుపరచబడెను? లేతమొక్కవలెను, ఎండిన భూమిలో మొలిచిన మొక్కవలెను అతడు ఆయన యెదుట పెరిగెను. అతనికి సురూపమైనను, సొగసైనను లేదు. మనమతని చూచి అపేక్షించునట్లుగా అతనియందు సురూపము లేదు" (యెషయా 53:1-2). యిది ఆశ్చర్యం !

బైబిలులో అతి ప్రాముఖ్యమైన వ్యక్తిని గూర్చిన భౌతికవివరణ ఉన్నదంతా యింతే! అదయినా ప్రవచనాత్మకమైన మాటలతో మిళితమై యున్నమాటలే. ఆయన యేసుక్రీస్తు ! క్రైస్తవమత స్థాపకుడు, క్రీస్తుసంఘ శిరస్సు ! మానవుల రక్షకుడు ! ఆయనకు సురూపమైనను, సొగసైనను లేదట ! యేసుక్రీస్తును గూర్చి

వ్రాయవలసివస్తే ఏ మానవమాత్రులు ఇట్లు వ్రాయగలరు? వారాయనను పలు రీతులుగా శ్లాఘించుచు మనకు వర్ణన యిచ్చియుందురు గదా ! అందునుబట్టియే బైబిలు గ్రంధకర్త మానవుడు కాదనుటలో సందేహము లేదు.

పరిశుద్ధ గ్రంథమైన బైబిలు దేవుని వాక్యం, దేవునిగూర్చి, యేసుక్రీస్తు రక్షకునిగూర్చి, మానవుల పాపవిముక్తిని గూర్చి అది బోధించుచున్నది. దాని మాటలను వినినవాడు ధన్యుడు. అందున్న ప్రవచనవాక్యములు చదువువాడును, వాటిని విని అందులో వ్రాయబడిన సంగతులు గైకొనువాడును ధన్యుడు (ప్రక 1:3). "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని, మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 1:21). బైబిలు లేఖకులు మానవులు, గాని దాన్ని లిఖింపజేసినవాడు దేవుడు. (సశేషము).

## డెబ్బదివారములను గూర్చిన దానియేలు ప్రవచనము

### (Daniel's Prophecy of the Seventy Weeks)

పాతనిబంధనలో తాను నెరవేర్చు ప్రవచనములున్నవని యేసుప్రభువు వక్కాణించెను (లూకా 24:27,44). యేసుక్రీస్తును గూర్చి పాతనిబంధనలో 300 కంటే ఎక్కువ ప్రవచనములున్నవి. వాటిలో ఒకటి దానియేలు 9:24-27లో యున్నది. ఈ ప్రవచనము సాధారణంగా దానియేలు యొక్క డెబ్బదివారముల ప్రవచనమని చెప్పుట కద్దు. దానిని ఈ వ్యాసములో గమనించుదాం.

దానియేలు ప్రవచనము యొక్క సరియైన విశ్లేషణ అనేక సంగతులపై ఆధారపడియున్నది. మొదటిగా ఆ ప్రవచనము చెప్పబడిన చారిత్రాత్మక సందర్భమును మనం గమనించాలి. రెండవది మెస్సీయ యొక్క పనినిగూర్చి

ఈ ప్రవచనంలో చెప్పబడిన సంగతిని గమనించాలి. మూడవది, ఆ ప్రవచనము యొక్క కాలక్రమము(Chronology) కూడ మనం గమనించాలి. దేవుడు నిర్ణయించిన కాలమును అది సరిగ్గా సూచించు ఒక ఉదాహరణయైయున్నది. చివరిగా, యూదులు క్రీస్తును నిరాకరించినందున వారిపై వచ్చు తీవ్రమైన తీర్పును కూడా మనం గమనించవలసియున్నది. వీటిని ఒక్కొక్క దానిని మనం జాగ్రత్తగా గమనించుదాం.

## చారిత్రాత్మక సందర్భము

ఇశ్రాయేలీయుల యొక్క భ్రష్టత్వము వలన వారు బబులోనుకు చెరగొని పోబడుదురని యిర్మియా ప్రవచించెను. తమది కాని ఆ దేశములో వారు డెబ్బది సంవత్సరముల మట్టుకు బంధింపబడుదురు (యిర్మియా 25:12, 29:10). ప్రవక్త చెప్పినట్లుగానే ఖచ్చితముగా అది సంభవించెను. బబులోనులో ఇశ్రాయేలీయులు ఇంచుమించు 70 సంవత్సరములు చెరలో యుండిరి (దానియేలు 9:2; 2దినవృ 36:21; జెకర్యా 1:12, 7:5). అయితే 60 లేక 80 సంవత్సరములు గాక, 70 సంవత్సరములే ఎందుకు విధించబడెను ? ఈ ఖచ్చితమైన కాలమునకొక కారణము లేకపోలేదు.

మోషే ధర్మశాస్త్రము ప్రతి పదవ సంవత్సరమును విశ్రాంతి సంవత్సరముగా పరిగణించవలెనని ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించెను. విశ్రాంతి సంవత్సరములో వారు చేను విత్తకూడదు (లేవీ 25:1-7).అయితే శతాబ్దాలు తరబడి కొలదీ ఇశ్రాయేలీయులు ఈ యాజ్ఞను విస్మరించియుండిరి. వారు చెరపట్టబడకముందు ఈ విశ్రాంతి సంవత్సరమును పాటించినట్లు ఎక్కడ కనబడదు. అందువలన వారి దేశము విశ్రాంతి దినములననుభవించునట్లు డెబ్బది సంవత్సరముల కాలము వారు బబులోను చెరలోనుండిరి (2 దినవృ 36:21).

ఈ డెబ్బది సంవత్సరములలో ఒక్కొక్కటి వారు నిర్లక్ష్యము చేసిన విశ్రాంతి సంవత్సరమునకు (ప్రతి ఏడవ సంవత్సరమునకు) గుర్తు అయితే ఇశ్రాయేలీయులు 490 సంవత్సరములు మట్టుకు దేవుని ఆజ్ఞను ఈ విషయంలో పాటించలేనట్లగుపడుచున్నది. గనుక వారు చెరపట్టబడిన కాలము అయిదు శతాబ్దముల మట్టుకు వారు దేవుని ఆజ్ఞను నిర్లక్ష్యముచేసిన కాలమును సూచించుచున్నది. అదే సమయంలో దానియేలు యొక్క ప్రవచనము రాబోవు 490 సంవత్సరములను ఎదురుచూచుచు పాపము నివారణ చేయుటకు అభిషిక్తుడు ప్రత్యక్షమయ్యే సమయాన్ని సూచించుచున్నది. అందువలన నాటికాలపు చరిత్రకు మధ్యలో దానియేలు ప్రవచనమున్నది.

మాదీయులపైన దర్యావేషు రాజైన మొదటి సంవత్సరములో యిర్మీయా ద్వారా దేవుడు సెలవిచ్చిన డెబ్బది సంవత్సరముల కాలము సంపూర్తియగుచున్నదని దానియేలు గ్రహించెను (దానియేలు 9:1-2).అందువలన అతడు దేవుడైన యెహోవా యెదుట ప్రార్థనచేసెను. దానియేలు తన యొక్కయు, తన ప్రజల యొక్కయు పాపములను ఒప్పుకొనెను. యెరూషలేమును గూర్చి దేవునియొక్క రౌద్రము తొలగిపోవలెననియు, దేవాలయము తిరిగి నిర్మింపబడవలెనియు అతడు దేవునికి విజ్ఞాపనచేసెను (దాని. 9:16-17). తన ప్రార్థనలకు జవాబుగా గబ్రియేలను దూత ద్వారా దేవుడు అతనికి వర్తమానము పంపెను (9:24-27). యెరూషలేము మరల కట్టించబడును. అయితే దేవాలయము కంటే గొప్పవాడగు అభిషిక్తుడగు అధిపతి వచ్చును. అది గొప్ప ఆశీర్వాదము (మత్తయి 12:6). నీరసపడిపోయిన హెబ్రీయులకు ఈ వర్తమానము ఆనందదాయకమయ్యెను.

## మెస్సీయా యొక్క కృషి

ఈ వర్తమానము భూమి మీద మెస్సీయా యొక్క ప్రాధమిక కర్తవ్యమును

వివరించుచున్నది. మొదటిగా ఆయన పాపము యొక్క సమస్యను పరిష్కరించును. ఆయన తిరుగుబాటుకు మార్పును, పాపమును నివారణచేయును, దోషము నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయును. ఈ వర్తమానము క్రొత్తనిబంధన యంతటిలోను మహిమాన్వితముగా అభివృద్ధిచేయబడినది (మత్తయి 1:21; 20:28; 1కొరింధి. 15:3; 2కొరింథీ. 5:21; గలతీ. 1:4; ఎఫెసీ 1:7; కొలస్స 1:20; 1పేతురు 2:4; ప్రకటన 1:5లను చదివితే పై అంశమును ఈ లేఖనభాగములు సవిస్తరముగా బోధించుచున్నవి).

క్రీస్తు రాకవలన భూమిమీద దుష్టత్వము అంతముకాలేదు. గాని మానవుల పాపము యొక్క సమస్యకు నిత్య పరిష్కారమార్గమును ఆయన ఆవిష్కరించెను. యిది హెబ్రీ పత్రిక యొక్క ముఖ్య ఉద్దేశ్యము కూడా. యేసుయొక్క మరణము 'ఒక్కసారే' సంభవించిన సంఘటన (హెబ్రీ 9:26). కల్వరి అనుభవాన్ని పదేపదే అనుభవించుటకు ఆయన మరల భూమిమీదకు రావలసిన పనిలేదు.

రెండవదిగా, అభిషిక్తుడు (క్రీస్తు) విమోచన పథకాన్ని ఆవిష్కరించుటయే గాక, ఆయన యుగాంతమువరకుండునట్టి నీతిని, బయలుపరచునని దానియేలు ప్రవచించాడు. యిది సువార్త యుగమునుద్దేశించి చెప్పబడిన మాట. మానవుని నీతిమంతునిగా తీర్చు పరలోక సంకల్పము యిప్పటికాలమందు సువార్తద్వారా బయలుపరచబడెనని అపొ. పౌలు రోమాపత్రికలో వివరించాడు (రోమా. 3: 21-26; 1:16-17).

మూడవదిగా, క్రీస్తుయొక్క పనివలన దర్శనమును, ప్రవచనమును ముద్రించబడునని ఆ వర్తమానములో దూత తెలియజేసెను (Vision and prophecy would be sealed up). మూలభాషయగు హెబ్రీ భాషలో యివి అంత మొందునని, ముగించబడునని చెప్పబడినది. పాతనిబంధన యొక్క ముఖ్య ఉద్దేశ్యము దేవుని కుమారుని రాకను ప్రకటించుటయేయని ఇక్కడ మనము

గమనించాలి. పురాతనకాల ప్రవక్తలు క్రీస్తు విషయమైన శ్రమలను గూర్చియు, వాటి తరువాత కలుగబోవు మహిమలను గూర్చియు ముందుగానే ప్రకటించిరియని పేతురు వక్కాణించెను. ఆ వర్తమానము సువార్త ద్వారా ప్రకటించబడుచున్నదని కూడ అతడు చెప్పెను (1పేతురు 1:10-12).

ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్యాంశమొకటియున్నది. రక్షకుడు వచ్చి మానవుని విమోచనను ఆవిష్కరించినపుడు, ఆవర్తమానమును వివరించు క్రొత్తనిబంధన సంపూర్తిగ లిఖించబడినపుడు దర్శనము యొక్కయు, ప్రవచనము యొక్కయు ఆవశ్యకత పాతగిలును. తత్ఫలితముగా ప్రవచనము (దానికి సంబంధించిన వరములు) నిలిచిపోయెను (1కొరింథీ 13:8-13; ఎఫెసీ 4:11-16). ఈ యుగములో దేవుడు అనుగ్రహించే దర్శనములు, ప్రవచనములు యేమీ లేవు.

నాలుగవదిగా, అతి పరిశుద్ధ స్థలము అభిషేకించబడునని దానియేలు ప్రవచించాడు. పాతనిబంధనలో అతి పరిశుద్ధ స్థలము అభిషేకించబడుటను గూర్చి ఎక్కడా చెప్పబడలేదు. గాని ప్రవక్త (1రాజులు 19:16), యాజకుడు (నిర్గమ 28:41), రాజు (1సమూయేలు 10:1), అభిషేకించబడుటను గూర్చి అది చెప్పు చున్నది. ముఖ్యముగా క్రీస్తు ఈ మూడు పాత్రలను వహించియున్నారు. ఆయన ప్రవక్త, యాజకుడు, రాజైయున్నారు (అపొ.కా. 3:20-23; హెబ్రీ 3:1; మత్తయి 21:5). క్రీస్తు యొక్క అభిషేకమును గూర్చి యెషయా 61:1లో చెప్పబడినది. నిజానికి క్రీస్తు అనగా అభిషిక్తుడని యర్థము.

అయిదవదిగా, అభిషిక్తుడు అనేకులకు నిబంధనకు స్థిరపరచును (9:27). అంటేక్రీస్తుయొక్క నిబంధన స్థిరముగా నుండును. ఆయన మరణించినను ఆయన నిబంధన నిలుచును.

ఆరవదిగా, క్రీస్తుయొక్క మరణము వలన బలియు, నైవేద్యమును నిలిపివేయబడును (దాని. 9:27). క్రీస్తు గొల్గొతాలో బలిగా అర్పించబడినందున యూదుల యొక్క బలులు, నైవేద్యములు అంతమగును. క్రీస్తు మరణించినపుడు మోషే ధర్మశాస్త్రము సిలువకు మేకులతో కొట్టబడెను (కొలస్స 2:14). మధ్య గోడ పడగొట్టబడెను (ఎఫెసీ 2:13-17), మరియు రెండవదాని వలన మొదటి నిబంధన ఎత్తివేయబడెను (హెబ్రీ 10:9-10). యిర్మియా ప్రవక్తయొక్క ప్రవచన క్రొత్తనిబంధన యిది (యిర్మియా 31:31-34; హెబ్రీ 8:7). అది క్రీస్తు రక్తముచే ముద్రించబడెను (మత్తయి 26:28). ఈ సందర్భము అంతా క్రీస్తు యొక్క విమోచనా కృషిని గూర్చిన సత్యనిధియై యున్నది.

## ప్రవచన కాలక్రమము

దానియేలు యొక్క ఈ ప్రఖ్యాత ప్రవచనము వలన వాగ్దానము చేయబడిన మెస్సీయా మానవులపాపము కొరకు ఎప్పుడు మరణించునో విజ్ఞులగు హెబ్రీయులు తెలిసికొనగలిగిరి. ఈ ప్రవచనకాలక్రమములో మూడు సంగతులున్నాయి : దాని ఆరంభకాలము, అమలులోయున్న కాలము మరియు దాని ముగింపుకాలము.

దాని ఆరంభకాలము " యెరూషలేము మరల కట్టించబడవచ్చునని ఆజ్ఞ బయలుదేరినపుడు" మొదలగును. దాని ఆరంభకాలమునకు అంత్యకాలమునకు మధ్య "డెబ్బది వారములు" అని చెప్పబడెను. యిది ఏడేసి రోజులు గల డెబ్బది వారముల సమయం; అనగా 490 రోజులు. ప్రవచనాత్మక చరిత్రలో ఒక్కోరోజు ఒక సంవత్సరమును సూచించును. గనుక ఈ 490 రోజులు 490 సంవత్సరములను సూచించుచున్నవని బైబిలు వేత్తలందరు అంగీకరింతురు. చివరిగా "అభిషిక్తుడు నిర్మూలము చేయబడుటతో" ఆ ప్రవచనకాలము ముగియును.

గమనిక :

ఈ కాలక్రమము సరిగ్గా 486½ సంత్సరములు. యివి మూడుభాగములుగా విభజింపబడియున్నవి. యెరూషలేము తిరిగి కట్టబడవలెనను ఆజ్ఞ జారీ అయినప్పటి నుండి క్రీస్తు మరణించిన మధ్య కాలము యిది.

ప్రవచనము యొక్క ఆరంభసమయాన్ని సరిగ్గా నిర్ణయించ గలిగితే, అది అమలులోయున్నకాలమును బట్టి ప్రభువు యొక్క మరణసమయాన్ని కూడ మనము ఖచ్చితముగా తెలిసికోగలము. గనుక ఈ విషయంపై మన దృష్టి సాధించుదము.

ఆ డెబ్బది వారముల సమయం ఆరంభమవడానికి వీలుగా కనీసం మూడు తేదీలున్నాయి. క్రీ.పూ. 536లో జెరుబ్బాబెలు కొందరు హెబ్రీయులను చెరనుండి బయటకు కొనిపోయెను. అయితే యిది ఆరంభసమయాన్ని సూచించు సంఘటన కాదు. ఏలయనగా క్రీ॥పూ॥ 536 నుండి 486 సంవత్సరములు ముందుకు పోతే మనం క్రీ॥పూ॥ 50వ సంవత్సరమునకు వస్తాయి. అది క్రీస్తుమరణానికి 80 సంవత్సరములు ముందు. రెండవది, క్రీ॥పూ॥ 444లో నెహెమ్యా కొంతమందిని కానానుకు తీసికొనిపోయెను. ఆ ప్రవచనారంభకాలము యిదా? బహుశా కాదు. ఏలయనగా క్రీ॥పూ॥ 486 నుండి 444 తీసివేస్తే క్రీ॥శ॥ 42లోకి మనం వస్తాము. యిది క్రీస్తు మరణం తరువాత 12 సంవత్సరములు. అయితే క్రీ॥పూ॥ 457లో ఎజ్రా కొంతమందిని బబులోను నుండి యెరూషలేముకు తీసికొనివెళ్ళెను. ఈ తేదీ గణితాంకముగా సరిపోవునా? సరిగ్గా సరిపోవును. క్రీ॥పూ॥ 457లో ఆరంభమై 486½ సంవత్సరములు మనం ముందుకు పోతే, క్రీ॥శ 30వ సంవత్సరమునకు వస్తాము. క్రీస్తు సిలువవేయబడిన సంవత్సరం అదే !

డెబ్బయ్యోవారము మధ్యలో అనగా 486½ సంవత్సరముల తరువాత అభిషిక్తుడు 'నిర్మూలము' చేయబడవలెను. యిది యేసుక్రీస్తు యొక్క మరణాన్ని

గూర్చి చెప్పబడినది. "సజీవుల భూమిలోనుండి అతడు (ఆయన) కొట్టివేయ బడెనని" యెషయా కూడా ప్రవచించాడు (యెషయా 53:8).

అయితే దానియేలు చెప్పిన డెబ్బదివారములు మూడు భాగములుగా ఎందుకు చేయబడ్డాయి ? అవి: ఏడువారములు, 62 వారములు, అర్ధవారము అను మూడుభాగములుగా చెప్పబడ్డాయి. ఈ విభజనలో గొప్ప ప్రాముఖ్యత లేకపోలేదు.

మొదటి భాగమగు ఏడు వారములు (49 రోజులు) అనగా 49 సంవత్సరములు హెబ్రీయులు పాలస్తీనాకు తిరిగివచ్చి యెరూషలేమును తిరిగి కట్టుటకు వారికి పట్టినసమయం (దానియే. 9:25). అది దానియేలు యొక్క ప్రార్ధనలకు జవాబు. యెరూషలేము తిరిగి కట్టబడు సమయం గడ్డు సమయం. యూదుల యొక్క శత్రువులు గతంలో వారిని నానాబాధలు పెట్టారు (ఎజ్రా 4:1-16). వారు ఎజ్రా, నెహెమ్యాల సమయంలో కూడా ఆ బాధలు కొనసాగించారు.

తరువాత భాగం 62 వారములు (434 రోజులు) 434 సంవత్సరములు. దీనిని పైన చెప్పబడిన 49 సంవత్సరములతో కలిపితే 483 సంవత్సరములు. దీనిని క్రీ॥పూ॥ 457కు కలిపితే అది క్రీ॥శ 26 దగ్గరకు వచ్చును. యిది యేసుక్రీస్తు యోహాను దగ్గర బాప్తిస్మం పొందిన సంవత్సరం. అది ఆయన బహిరంగ సువార్త ప్రకటించుటకు ఆరంభించిన సంవత్సరం.

చివరిగా అర్ధవారము (3½ రోజులు) యేసుప్రభువు సువార్త ప్రకటనచేసిన 3½సంవత్సరముల కాలమును సూచించుచున్నది. దానియేలు ప్రవచనకాలము ఇక్కడ అంతమగుచున్నది. అది క్రీ॥శ 30వ సంవత్సరం. క్రీస్తు మరణించిన సంవత్సరం.

# క్రీస్తును నిరాకరించినందున కలిగిన పర్యవసానము

యేసుప్రభువును ఆయన స్వజనులగు యూదులే చంపించిరను వాస్తవమును ఎవరు కాదనలేరు (యోహాను 1:11). అయితే తమ రక్షకుని నిరాకరించినందున ఒక జనాంగముగా ఇశ్రాయేలీయులు తీవ్రమైన పరిణామము నెదుర్కొనవలసివచ్చినది.

రోమా సైనికులు యెరూషలేమును ముట్టడించి, దేవాలయమును నాశనము చేతురని దానియేలు ప్రవచించాడు. ఒక రాజు హఠాత్తుగా వచ్చి యెరూషలేమును, పరిశుద్ధ ఆలయమును నాశనము చేయునని దానియేలు ప్రవచించాడు (దానియే. 9:26). యూదులు దేవుని కుమారుని నిరాకరించినందువలన దేవునిచే ఇదంతయు నిర్ణయించబడెను (దానియే. 9:26-27; మత్తయి 21:37-41; 22:1-7).

ఈ ప్రవచన భావార్థము సంశయములేనిది. యెరూషలేము నాశనము గూర్చి యేసుప్రభువు మాట్లాడుచు "ప్రవక్తయైన దానియేలు ద్వారా చెప్పబడిన నాశనకరమైన హేయవస్తువు పరిశుద్ధ స్థలమందు నిలుచుండుటను" గూర్చి చెప్పెను (మత్తయి 24:15). ఇక్కడ చెప్పబడిన నాశనకరమైన హేయవస్తువు రోమా సైన్యము. దాని రాజు టైటస్. అతడు క్రీ॥శ॥ 70లో యెరూషలేమును ముట్టడిచేసి నాశనము చేసెను.

చారిత్రక వాస్తవములు ఈ విధంగాయున్నాయి. క్రీ॥శ 60లో రోమా సామ్రాజ్య యేలుబడిలో యున్న యూదులు దానిపై తిరుగుబాటుచేసిరి. అందువలన యూదులకు, రోమీయులకు మధ్య కొన్ని సంవత్సరముల మట్టుకు రక్తపాతము సంభవించెను. ప్రఖ్యాతిగాంచిన వెస్పేసియన్ చక్రవర్తి కుమారుడగు టైటస్ అనునతడు యెరూషలేమును 5నెలలపాటు ముట్టడిచేసి దానిని ఓడించెను. పరిశుద్ధ పట్టణము అగ్నికి ఆహుతిచేయబడెను (మత్తయి 22:7), మరియు

దేవాలయము పడగొట్టబడి చిత్తుచేయబడెను. రాతి మీద రాయి లేకుండా దేవాలయము నాశనము చేయబడుననియు, యెరూషలేము నాశనము గావించ బడుననియు క్రీస్తు తన శిష్యులకు ముందుగానే తెలియజేసెను (మత్తయి 23:37-38; 24:2). పురాతత్వశాస్త్రజ్ఞులు ఆ దేవాలయము యొక్క రాతిని ఒక్క దానినే ఇప్పుడు గుర్తించగలిగిరి.

జె.ఎన్. జెల్డెన్ హైయిస్ అను చరిత్రకారుడు ఇట్లు చెప్పుచున్నాడు : "టైటస్ చక్రవర్తి యెరూషలేమును ముట్టడివేసి పట్టుకొనెను. దేవాలయమును కొల్లగొట్టెను. యూదుల స్త్రీ, పురుషులను, పిల్లలను వేవేలకొలది హతమార్చెను. వారి రక్తదాహము తీరిన తరువాత బలిష్టులైన వారందరినీ రోమీయులు బందీలుగా తీసికొనిపోయిరి. వారు బలహీనులను, వృద్ధులను హతమార్చిరి. పట్టణములో గాని, దాని పరిసర ప్రాంతములో గాని ఒక్క యూదుడు కూడా లేకుండా పారిపోయిరి. సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే వారు యెరూషలేము పొలిమేరలలో యుండి దాని కొరకు సంతాపము పాటించుటకు వారికి అనుమతి ఇయ్యబడెను".

దీనిని నాశనకరమైన హేయవస్తువని దానియేలు ప్రవచించాడు. ఏలయనగా దావీదు పట్టణం నాశనం చేయబడెను. దానిని నాశనం చేసినవారు విగ్రహారాధికులు గనుక వారు హేయమైన వారు. యెరూషలేము ఈలాగున నాశనము చేయబడుట దానియేలు ప్రవచన నెరవేర్పేయని యూదులు కూడ ఒప్పుకొందురు. చరిత్ర కారుడగు జోసిఫస్ కూడా "దానియేలు రోమా ప్రభుత్వమును గూర్చి, వారు మా దేశమునకు చేయునాశనమును గూర్చి కూడా వ్రాసెను" అని అంగీకరించాడు.

ముగింపు :-

పరిశుద్ధాత్మావేశముచే దానియేలు చెప్పిన డెబ్బదివారముల ప్రవచనము, లేఖనముల యదార్థతను గొప్పగా చాటుచున్నది. మెస్సీయ యొక్క రాకను, ఆయన కరుణా కటాక్షములను గూర్చి అది ప్రవచించెను. యేసు యొక్క

సిలువమరణ సమయాన్ని అది ఖచ్చితంగా సూచించెను. చివరిగా దేవుని కుమారుని నిరాకరించుట వలన కలిగే నాశనకరమైన పరిణామములను గూర్చి అది తెలియ జేసెను. ఇంత గొప్ప సాక్ష్యమును మన ముందుంచిన యెహోవా దేవునికి స్తోత్రములు !!

- వెయిన్ జేక్సన్.
Reason & Revelation (July 1997)

## విశ్వాసమనగా ...
## (Faith is ...)

క్రైస్తవునికి దేవునితో గల సమస్త సంబంధములకు విశ్వాసము ఆధారమై యున్నది. క్రైస్తవునికున్న నిరీక్షణ యంతటికిని విశ్వాసము పునాది వంటిది. రక్షింపబడు వానిని రక్షకునితో కలుపునట్టిది విశ్వాసము. అయితే విశ్వాసము అను అంశమును అనేకులు అపార్థము చేసికొనుచున్నారు. విశ్వాసము యొక్క అర్థము గూర్చియు, దానిని కార్యాచరణలోనుంచుటను గూర్చియు తెలిసికొనుటకు మనము బైబిలు నుండి సహాయమును వెదుకుదము. అట్లు చేయకముందు విశ్వాసము ఏమై యుండలేదో తెలిసికొనుట మనకు సహాయకరముగా యుండునని నాయభిప్రాయము.

విశ్వాసము గ్రుడ్డిది కాదు, అనాలోచితమైనది కాదు. అనాలోచితముగాను, గ్రుడ్డితనముగాను అనేకులు అనుసరించు మతములు కలవు. అట్టివి మూఢనమ్మకములపై ఆధారపడి యున్నవి. అయితే లేఖనములు విశ్వాసమును గూర్చి చెప్పుసంగతి దానికి వేరుగయున్నది : "కాగా వినుట వలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాటలవలన కలుగును" అని బైబిలు బోధించుచున్నది (రోమా 10:17). దేవుని నుండి వచ్చిన సాక్ష్యముపై విశ్వాసము

ఆధారపడియున్నది. మనము యేసునందు నమ్మునట్లు భక్తుడైన యోహాను తన సువార్తను వ్రాసెను (యోహాను 20:30,31). ఒక బోధకుడు లేఖనముల ప్రకారము బోధించుచున్నాడో లేదో వినుచున్నవారు లేఖనములను పరిశోధించి తెలిసి కొనవలెనని దేవుడు కోరుచున్నాడు (అపొ.కా. 17:11). అనాలోచిత మూఢత్వమునకు ఖచ్చితముగా వ్యతిరేకమైనది విశ్వాసము.

విశ్వాసము చిత్తవిభ్రమ సంబంధమైనది (Emotionalism) కాదు. ఆరాధనలో గంతులు వేయుట, కేకలు వేయుట, బొబ్బలు పెట్టుచు చప్పట్లు కొట్టుట అనునవి చిత్తవిభ్రమ సంబంధమైనవి. అవి విశ్వాససంబంధమైనవి కావు. బైబిలు విశ్వాసము ఎల్లప్పుడు వాస్తవములపైనను, వాటి జ్ఞానముపైనను ఆధారపడియున్నది. వివేకశిష్టమైన (rational) మనస్సును, భావనాప్రేరితమైన హృదయమును అది ఆకర్షించును. అందుకే "నేను నమ్మిన వానిని ఎరుగుదును" అని అపొ.పౌలు చెప్పగలిగెను (2తిమోతి 1:12). మరల గలతీయులకు వ్రాయుచు అతడు మీరు "ధర్మశాస్త్ర సంబంధ క్రియలవలను ఆత్మను పొందితిరా లేక విశ్వాసముతో వినుటవలన పొందితిరా ?" యని అడిగెను (గలతీ 3:2). విశ్వాసము ఎల్లప్పుడు సాక్ష్యముపై ఆధారపడి యున్నది.

విశ్వాసము బుద్ధిహీనత కాదు. ఈ మధ్య కొందరు బోధకులు తమకున్న విశ్వాసమును నిరూపించుటకుగాను పాములను పట్టుకొనుట, విషమును మ్రింగుట చేసి చనిపోయినట్లు వార్తాపత్రికలో చదివి యుంటిమి. బైబిలులో విశ్వాసము ఎన్నడు ఈరీతిగ చిత్రీకరింపబడలేదు. సరిగదా విశ్వాసులు ఆరోగ్య కరమైన బుద్ధి, ఆత్మనిగ్రహము కలిగినవారని బైబిలు బోధించుచున్నది. యేసు దేవుని కుమారుడని నిరూపించుకొనుటకు గాను దేవాలయ శిఖరమునుండి అపవాది ఆయనను దుముకుమని ప్రోత్సహించినను దానికి ఆయన లోబడలేదు (మత్తయి 4:5-7).

నేను దేనినైనను సంపూర్ణముగా అర్థము చేసికొంటేనే గాని దానిని నమ్మను అనునట్టిది విశ్వాసము కాదు. లేఖనములలో సమస్తమును మనము గ్రహించుకొన గలమని దేవుడు చెప్పలేదు గాని మనము ఆయన మాటను విశ్వసించవలెను. మనము వెలిచూపును బట్టి కాక విశ్వాసమును బట్టి నడుచుకొనవలెనని ఆయన కోరుచున్నాడు (2కొరింథీ 5:7). దేవుడేమైనను చెప్పిన యెడల విశ్వాసము దానిని గ్రహించినను గ్రహించకపోయినను దానిని నమ్మును.

విశ్వాసము ఏమైయుండలేదో ఇంతవరకు మనము చూచాము. ఇప్పుడు విశ్వాసమనగా యేమిటో పరిశీలింతము.

దేవుడు తన వాక్యమునందిచ్చిన సాక్ష్యమును నమ్ముట విశ్వాసము. "కాగా వినుటవలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును." నీవు దేవుని వాక్యమును ఎంతవరకు చదివి గ్రహించుకొనగలవో అంతమట్టుకు నీ విశ్వాసముండునని ఈ వాక్యమువలన మనము గ్రహించుకొన గలము.

సమస్త విషయములలోను దేవుని, ఆయన కుమారుని నమ్ముటయే విశ్వాసము. "అబ్రహాము పిలువబడినప్పుడు విశ్వాసమును బట్టి ఆ పిలుపునకు లోబడి, తాను స్వాస్థ్యముగా పొందనై యున్న ప్రదేశమునకు బయలు వెళ్లెను. మరియు ఎక్కడికి వెళ్ళవలెనో అది ఎరుగక బయలు వెళ్లెను" (హెబ్రీ 11:8). మరణమునకైనను, జీవమునకైనను దేవునియందు సంపూర్ణ నమ్మిక కలిగి యుండుట విశ్వాసము.

దేవుని వాగ్దానములను లేక హెచ్చరికలను విశ్వసించి వాటి ప్రకారము చేయుట విశ్వాసము. శారా గొడ్రాలై 90 సంవత్సరముల వృద్ధురాలైనను తానొక కుమారుని కందునని విశ్వసించెను. ఆమె ఇస్సాకును కనెను (హెబ్రీ 11:11).

అంతకు ముందెన్నడు వర్షము భూమిపై కురియకపోయినను, భూలోకమునంతటిని జలప్రళయము ద్వారా నాశనము చేసెదనని దేవుడు నోవహుతో చెప్పగా అతడు దానిని విశ్వసించి ఒక ఓడను తయారుచేసికొని తన కుటుంబమును రక్షించుకొనెను (హెబ్రీ 11:7).

దేవుడు చేయుమని చెప్పిన దానిని ఆయన చెప్పినట్లే చేయుట విశ్వాసము. ప్రేమ ద్వారా పనిచేయు విశ్వాసమును దేవుడు కోరుచున్నాడు (గలతీ 5:6). "విశ్వాసమును బట్టి హేబెలు కయీనుకంటే శ్రేష్ఠమైన బలి దేవునికి అర్పించెను... అతడు ఆ విశ్వాసమును బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను" (హెబ్రీ 11:4). దేవుని వాక్యమును వినుటవలన విశ్వాసము కలుగును గనుక జంతుబలిని అర్పించుమని దేవుడు చెప్పిన దానిని హేబెలు వినెను. కయీనయితే దేవుడు కోరినట్లుగాక తన యిష్టప్రకారము దేవునికి అర్పణలను తెచ్చెను. అతడు తిరస్కరించ బడెను. ఎందువలన ? అతడు విశ్వాసమును బట్టి నడుచుకొననందు వలన. ఆరాధనలో గాని, పరిచర్యలోగాని, రక్షణ మార్గములో గాని విశ్వాసము దేవుని మాటచొప్పున నడుచుకొనును.

ఎన్ని అపాయములు సంభవించినను దేవుని చిత్తమును చేయుట విశ్వాసము. "అబ్రహాము శోధింపబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను" (హెబ్రీ 11:7). తనకు లేకలేక వృద్ధాప్యములో జన్మించిన ఇస్సాకును దేవునికి బలిగా అర్పించుట అబ్రహాముకు ఎంత అయిష్టమైన సంగతియో మనము ఊహించలేము. అయినను దేవుడాజ్ఞాపించిన దానిని అబ్రహాము చేసెను. దేవుని ఆజ్ఞలన్నియును మనము అర్థము చేసికొనలేక పోవచ్చును. అయినను దేవుడాజ్ఞాపించుచున్నాడు గనుక విశ్వాసమును బట్టి వాటికి లోబడుట మంచిది.

"విశ్వాసము నిరీక్షింపబడువాటి యొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది" (హెబ్రీ 11:1). మనము పరలోకమును

చూడకపోయినను విశ్వాసము వలన అది నిజమని మనము నమ్మగలము. మనము చూడలేకపోవుచున్న అనేక అట్టి సంగతుల యధార్థతను విశ్వాసము వలన మనము గ్రహించుకొనవచ్చును. అవన్నియు ఉన్నవని దేవుడు చెప్పినందున విశ్వాసము వాటి యధార్థతను అంగీకరించును.

రక్షింపబడుటకు విశ్వాసము దేవునిపై ఆధారపడును గాని స్వనీతిపై కాదు. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు. దేవుని వరమే" (ఎఫెసీ 2:8,9).

రక్షింపబడుటకు క్రీస్తు ప్రభువనియు, రక్షకుడనియు విశ్వాసము అంగీకరించును, "యేసుప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు" (రోమా 10:9). రక్షించు విశ్వాసము విధేయత చూపించు విశ్వాసమైనది. క్రియలు లేని విశ్వాసము మృతమైనది (యాకోబు 2:26). దేవుని ఆజ్ఞలన్నిటికిని వినయముతో విధేయత చూపించు విశ్వాసమే రక్షించు విశ్వాసము.

విశ్వాసము అభివృద్ధి జెందునట్టిది. అబ్రహామునకున్నట్టి విశ్వాసము నీకు లేనందున నీవు నిరుత్సాహపడనవుసరము లేదు. దేవుని వాక్యమును నీదైనిక ఆత్మీయాహారముగా అంగీకరించి దానిని దినదినము ధ్యానించిన యెడల నీవు విశ్వాసములో దృఢముగ పెరుగుగలవు. విశ్వాసము పాపమునుండి, శోధనల నుండి నిన్ను కాపాడును. అందుకే పౌలు, మీరు "విశ్వాసమను డాలు పట్టుకొనుడి, దానితో మీరు దుష్టుని అగ్ని బాణములన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులుపుదురు" అని క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు (ఎఫెసీ 6:16).

క్రీస్తే మన విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించు వాడునై యున్నాడు (హెబ్రీ 12:2). పాపివైన నీవు రక్షింపబడవలెనంటే యేసుక్రీస్తు దేవుని కుమారుడని

విశ్వసించుము. నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము. క్రీస్తునందున్న నీ విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనుచు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు నీవును నీ విశ్వాసము వలన దేవుని కుమారుడవు కాగలవు (గలతీ 3:26).

- జాషువా గూటం.

# పునరుత్థానము
## (Resurrection)

'పునరుత్థానము' అనగా 'తిరిగిలేచుట' అని అర్థము. క్రీస్తు మృతులలో నుండి సజీవుడై లేచినందువలన క్రీస్తు పునరుత్థానము ఒక ప్రాముఖ్యాంశమయింది. దీనికి అనేకమైన ఋజువులున్నాయి. పునరుత్థానము తరువాత క్రీస్తును సిలువ వేసిన ప్రజలమధ్య ఇదే అంశముపై పేతురు బోధించుచు, లేఖనాధారాలను చూపుచు, ఆనాటి యూదుల మధ్య క్రీస్తు పునరుత్థానమును ఋజువు చేసెను. "మరణము ఆయనను బంధించి యుండుట అసాధ్యము గనుక దేవుడు మరణ వేదనలను తొలగించి ఆయనను లేపెను" (అపొ.కా. 2:24). వారియెదుట ఈ అంశము ఋజువు చేయబడినందువలన "వారు ఈ మాటవిని హృదయములో నొచ్చుకొని-సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడిగిరి" (అపొ.కా. 2:37).

"ఆయన శ్రమపడిన తరువాత నలువది దినముల వరకు వారికగుపడుచు దేవునిరాజ్య విషయములను గూర్చి బోధించుచు అనేక ఋజువులను చూపి వారికి తన్ను తాను సజీవునిగా కనుపరచుకొనెను" (అపొ.కా. 1:3).

క్రీస్తు చనిపోయి సమాధి చేయబడెను. "మరునాడు అనగా సిద్ధపరచు దినమునకు మరుసటి దినమున ప్రధాన యాజకులును, పరిసయ్యులును పిలాతు

నొద్దకు కూడి వచ్చి, అయ్యా, ఆ వంచకుడు సజీవుడై యుండినప్పుడు-మూడు దినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది. కాబట్టి మూడవ దినము వరకు సమాధిని భద్రము చేయనాజ్ఞాపించుము. వాని శిష్యులు వచ్చి వానిని ఎత్తుకొని పోయి - ఆయన మృతులలో నుండి లేచెనని ప్రజలతో చెప్పుదురేమో; అప్పుడు మొదటి వంచనకంటె కడపటి వంచన మరి చెడ్డదై యుండునని చెప్పిరి. అందుకు పిలాతు కావలి వారున్నారు కదా మీరు వెళ్ళి మీచేతనైనంత మట్టుకు సమాధిని భద్రము చేయుడని వారితో చెప్పెను. వారు వెళ్ళి కావలి వారిని కూడ ఉంచుకొని, రాతికి ముద్ర వేసి సమాధిని భద్రము చేసిరి" (మత్తయి 27:62-66).

సమాధిని ఎంత భద్రము చేసినను, మూడవ దినాన రాయి పొర్లింపబడిన ఖాళీ సమాధి కనపడింది. కావలి వారిని ప్రశ్నిస్తే వారి సమాధానం "మేము నిద్రపోవు చుండగా అతని శిష్యులు రాత్రివేళ వచ్చి అతనిని ఎత్తుకొనిపోయిరి" (మత్తయి 28:13). ఇది అబద్ధ సాక్ష్యమనుటకు బలమైన ఋజువులున్నాయి.

1. నిద్రపోవుటకు వారు అక్కడ నియమింపబడలేదు. వారి బాధ్యత నిర్వర్తించక పోవుట వలన వారు శిక్షార్హులు. అపొ.కా. 12:19 ప్రకారము వారు మరణశిక్షకు పాత్రులు. అయినను ఆనాటి ప్రభుత్వము వారిని శిక్షింపలేదు. మేము నిద్రపోతిమని ధైర్యముగ చెప్పారంటే ప్రధాన యాజకులు, పెద్దలు కలిసి వారిని తమకు అనుకూలముగ చేసాకొనిరి అనునది నిర్వివాదాంశం.

2. వారు నిద్రపోవుచుండగా నిశ్శబ్దముగానే ముద్రవేయబడిన అంతపెద్ద రాయిని (మార్కు 16:14) శిష్యులు పొర్లించిరా ? ఇదియును అసాధ్యమే.

3. ఈ సాక్ష్యము నిద్రపోవు వారిచ్చిన సాక్ష్యము. ఏ న్యాయస్థానమైనను దీనిని అంగీకరించునా ?

4. క్రీస్తును బంధించినపుడు పారిపోయిన శిష్యులు పాయుధులైన కావలివారితో పోరాడి వారిని ఓడించి, ఆయనను ఎత్తికొని పోయిరని చెప్పుటకును వీలులేదు.

అయితే శిష్యులకు ఈ వర్తమానము అనగా ఆయన ఖాళీ సమాధిని గూర్చిన వర్తమానము ఎప్పుడు తెలిసినదో లేఖనాలనుండి చదువుదాం. "ఆదివారమున ఇంకను చీకటిగా ఉన్నప్పుడు మగ్దలేనే మరియ పెందలకడ సమాధి యొద్దకు వచ్చి, సమాధి మీద ఉండిన రాయి తీయబడి యుండుట చూచెను. గనుక ఆమె పరుగెత్తికొని సీమోను పేతురు నొద్దకును యేసు ప్రేమించిన ఆ మరియొక శిష్యుని యొద్దకును వచ్చి-ప్రభువును సమాధిలో నుండి యెత్తికొని పోయిరి. ఆయనను ఎక్కడ ఉంచిరో యెరుగమని చెప్పెను. కాబట్టి పేతురును ఆ శిష్యుడును బయలుదేరి సమాధియొద్దకు వచ్చిరి" (యోహా 20:4).

"అంతట సీమోను పేతురు అతని వెంబడి వచ్చి సమాధిలో ప్రవేశించి నారబట్టలు పడియుండుటయు, ఆయన తల రుమాలు నారబట్టలు యొద్ద ఉండక వేరుగా ఒకచోట చుట్టి పెట్టి యుండుటయు చూచెను" (యోహాను 20:6-7). చుట్టిపెట్టి ఒకచోట చక్కగా ఉంచిన ఆయన తల రుమాలు ఆయన పునరుత్థానమునకు గొప్ప ఋజువుగానున్నది. ఆ సమాధిని ఎవరును దోపిడీ చేయలేదనుటకు యిది నిదర్శనము.

యేసును ఎరుగనని ముమ్మారు బొంకిన పేతురు పెంతెకొస్తు దినాన "పునరుత్థానము" అను అంశమును అక్కడ గుమికూడిన, యేసును సిలువవేసిన యూదులకు గంభీరముగ బోధించెను. పునరుత్థానమందలి విశ్వాసమును బట్టియే శిష్యులు బలపర్చబడిరి. శ్రమలలో ఉన్న క్రైస్తవులను ఆదరించుట కొరకు అపొస్తలులు క్రీస్తు పునరుత్థానమును గూర్చి అనగా క్రీస్తు విజయమును గూర్చి అపవాది పరాజయమును గూర్చి వివరించిరి.

పునరుత్థానము క్రీస్తు దైవత్వానికి గొప్ప ఋజువుగా ఉన్నది. క్రైస్తవులు క్రీస్తు పునరుత్థానమును విశ్వసించుటకు అనేక బలమైన ఋజువులున్నాయి. "క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు, ఆయన శరీరము కుళ్ళిపోలేదనియు దావీదు ముందుగా తెలిసికొని ఆయన పునరుత్థానమును గూర్చి చెప్పెను. ఈ యేసునే దేవుడు లేపెను. దీనికి మేమందరము సాక్షులము" (అపొ.కా. 2:31-32).

"మృతులలో నుండి యేసుక్రీస్తు తిరిగిలేచుట వలన జీవముతో కూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు, అనగా అక్షయ మైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకు కలుగునట్లు ఆయన తన విశేషకనికరము చొప్పున మనలను మరల జన్మింపజేసెను" (1పేతురు 1:3-4).

విశ్వసించి, మారుమనస్సు పొంది, ఒప్పుకొని, బాప్తిస్మము పొంది క్రీస్తు సంఘములో సభ్యులమై మరణము వరకు నమ్మకముగా ఉండి నిత్యజీవమునకు వారసులం కావాలని ఆయన కోరిక. బాప్తిస్మములో మనము ఆయన మరణ మందును సమాధిలోను ఆయన పునరుత్థానమందును పాలివారము కాగలము (రోమా 6:3-4).

- E.K.V. ప్రసాదరావు.


## FREE BIBLE CORRESPONDENCE COURSE IN ENGLISH

For your free course, Please print your complete name and address and send to :

**WORLD BIBLE SCHOOL**
**P.O. Box - 52, Jabalpur - 482001**
**Madhya Pradesh**

When you have completed the full course, you will receive a **certificate**.

## సంక్షిప్త వార్తలు

2000 నవంబరు 9వ తేదీనుండి 11వ తేదీ వరకు కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరిపల్లిలో సువార్త కూటములు, బైబిలు తరగతులు నిర్వహించ బడెను. ఆ కూటములలో సోదరులు జి.మార్కు (నందిగామ), కె.రాజకుమార్ (విజయవాడ), కె. అబెద్నగో(విజయవాడ), మరియు పి.జి.డి. కుమార్ (గన్నవరం) గార్లు వాక్యపరిచర్యచేసిరి. కేసరిపల్లి, గన్నవరం పెదఅవుటపల్లి గ్రామములనుండి ప్రజలు ఈ కూటములకు హాజరైరి. కూటముల అనంతరం ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కేసరిపల్లి, గన్నవరం ప్రాంతములలో సోదరులు పి. షడ్రక్ గారు క్రీస్తు కొరకు సువార్త పనిని జరిగించుచున్నారు.

నవంబరు 12వ తేదీ ఆదివారం జాషువాగూటం గారు సతీసమేతముగా రామచంద్రపురం కుమ్మరవీధిలో క్రీస్తుసంఘమును దర్శించి వాక్యపరిచర్య చేసిరి. రామచంద్రపురంలో సోదరులు యన్. లాజరస్‌గారు, వారి కుమారుడు క్రీస్తు కొరకు మంచిపనిచేయుచున్నారు.

నవంబరు 16వ తేదీ గురువారం నెల్లూరు పట్టణంలో వెంకటేశ్వర పురములో యున్న క్రీస్తుసంఘము ఒకరోజు పాటు ఏర్పాటుచేసిన సువార్త కూటములో సోదరులు జాషువాగారు సతీసమేతముగా హాజరైరి. ఉదయకాల కూటములోను, సాయంకాలకూటములోను సోదరులు జాషువాగారు మంచి వాక్యపరిచర్య చేసిరి. వెంకటేశ్వరపురంలో మొదటినుండీ పనిచేయుచున్న సోదరులు కె. స్వామిదాస్ గారు కూడా వాక్యపరిచర్యచేసి సంఘస్థులను హెచ్చరించిరి. స్థానికసంఘస్థులు హాజరైన వారికి అల్పాహారమునేర్పాటుచేసిరి. నెల్లూరు పట్టణములో సోదరులు కె. స్వామిదాస్‌గారు క్రీస్తు కొరకు అనేక సంవత్సరములనుండి నమ్మకమైన పనిచేయుచున్నారు.

నవంబరు 27వ తేదీనాడు జాషువాగూటంగారు, పెర్రికోతమ్ గారు నేపాల్ దేశములో సువార్త పర్యటన కొరకు బయలుదేరి వెళ్ళిరి. డిశంబరు మొదటి తేదీవరకు వారు అక్కడ యుందురు. కోతమ్‌గారు అక్కడనుండి మాద్రాసు, సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్ వెళ్ళుదురు. డిశంబరు ఆఖరువారంలో అమెరికా చేరుకొందురు ఆయన కొరకు ఆయన చేయుచున్న పనికొరకు అందరు ప్రార్థించమనవి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/99

From :
**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

*Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani - Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam.*